క్లుప్తంగా

వెన్నంపల్లిలో పోచమ్మ బోనాలు



వెన్నంపల్లిలో పోచమ్మ బోనాల ఊరేగింపు

సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లిలో పోచమ్మ బోనాల ఊరేగింపు జాతర బుధవారం నిర్వహించారు. ఇంటికో బోనం చేసుకొని, వాయిద్యాల చప్పుడు, వినూత్న నృత్యాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. రెడ్డి కులసంఘం నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ

మానకొండూర్: మహాలక్ష్మి పథకంలో భాగంగా నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్‌పోటీల్లో మానకొండూర్ మండలం పోచంపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన బి.అలేఖ్య, శ్రీజ, లావణ్య, వైష్ణవి, డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభకనబర్చిన ధరణి. సిరివెన్నెల, సహస్ర, మధుప్రియలను కలెక్టర్ పమేలా సత్పతి, కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీలు ప్రశంసించారు.

నిధులు విడుదల చేయాలి

ఇల్లందకుంట: ప్రత్యేకాధికారుల పాలనలో భాగంగా గ్రామపంచాయతీ కార్యదర్శులకు తిప్పలు తప్పడం లేదని సీపీఎం మండల కార్యదర్శి చెల్పూరి రాము అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు, ట్రాక్టర్లకు డీజిల్, వీధిలైట్లు, విద్యుత్ మోటార్లు కాలిపోతే మరమ్మతులు చేయడం వంటి ఖర్చులను కార్యదర్శులే భరించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కార్యదర్శులకు రావాల్సిన నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పీఆర్టీయూ ఇల్లందకుంట మండల కార్యవర్గం



కలికోట జయప్రకాశ్

ఇల్లందకుంట: పీఆర్టీయూ ఇల్లందకుంట మండల శాఖ కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు ఐలేని కరుణాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి జైపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కలికోట జయప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా పల్లె రామిరెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాకాల ప్రభాకర్‌రెడ్డి, ఎం.పద్మ, అశోక్, రవి, రాజేందర్‌రెడ్డి, సత్యం, కృష్ణమూర్తి, వరలక్ష్మి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గంగాధర: మండలంలోని గర్శకుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీ కార్డుల కోసం పలువురు దాతలు బుధవారం రూ.10వేల విరాళాన్ని ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణికి అందజేశారు. విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు చిందం అంజనేయులు, మిత్రుల సహకారంతో విరాళం అందించారు. చిప్ప సురేందర్, గజ్జల శ్రీనివాస్, మిట్టపల్లి గణేశ్, సత్యనారాయణ తదితరులున్నారు.

కేశవపట్నం బస్టాండ్‌లో ఆర్టీసీ సంబరాలు



తహసీల్దార్ సురేఖను సన్మానిస్తున్న డిపో మేనేజర్ రవీంద్రనాద్, మహిళా టీచర్లు

శంకరపట్నం: ఆర్టీసీ బస్సులో 200కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని బుధవారం కేశవపట్నం బస్టాండ్‌లో సంబరాలు నిర్వహించారు. తహసీల్దార్ సురేఖను హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్, మహిళా టీచర్లు సన్మానించారు. స్వామి, టీచర్లు వాణి, శ్రీవాణి, ఆర్టీసీ ఉద్యోగి గుర్రం స్వామి పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆశా కార్యకర్త మృతి

శంకరపట్నం: మండలంలోని రాజాపూర్‌కు చెందిన మాతంగి భాగ్యలక్ష్మి(49) అనే ఆశా కార్యకర్త బుధవారం గుండెపోటుతో మరణించినట్లు వైద్యాధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు.



గునుకుల కొండాపూర్ దళితకాలనీలో నిలిచిన వరదనీరు



అర్కండ్లలో లెవల్ బ్రిడ్జిపై వరద ప్రవాహం

భారీ వర్షం..

గన్నేరువరం/శంకరపట్నం: జిల్లావ్యాప్తంగా మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. పలు మండలాల్లో డ్రైనేజీలు నిండి రోడ్లపైకి నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పలు గ్రామాల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు నీటిని ఎత్తిపోశారు. చాలా రోజులు తర్వాత భారీ వర్షాలు కురవడంతో రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. కేశవపట్నం ఎస్సై శేఖర్‌రెడ్డి అర్కండ్ల వాగులో లెవల్‌బ్రిడ్జిపై వాహనాలు వెళ్లకుండా చర్యలు చేపట్టారు.



గునుకుల కొండాపూర్‌లో ఇంట్లోకి చేరిన వర్షపునీరు



డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ అయాజ్, అధికారులు

ముంపు ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ధర్మారం, కొత్తపల్లి, హౌజింగ్‌బోర్డు, పిట్టలవాడ, 10వ వార్డులతో పాటు పలు ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ ఆధ్వర్యంలో అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీల్లోని సిల్ట్‌ను తొలగించామని, వరద ముంపు లేకుండా చర్యలు చేపట్టామన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపల్ పరిధిలో 24గంటల పాటు మూడు టీం ఏర్పాటు చేశామని, ప్రజలకు సమస్య ఉంటే తెలపాలన్నారు. ఇక్కడ మేనేజర్ రాజిరెడ్డి, ఏఈ వికాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్, ఈఈ శ్రీకాంత్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కాలువ పనులకు నిధులు విడుదల చేయాలి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న చాడ వెంకటరెడ్డి, నాయకులు

చిగురుమామిడి: మండలంలోని ఇందుర్తి–భీమదేవరపల్లి మండలం వరకు శ్రీరాంసాగర్ ఎడమ కాల్వ ప్యాకేజీ–3లో చేపట్టాల్సిన పనులు నిలిచిపోయాయని, వెంటనే నిధులు విడుదల చేయాలని రాష్ట్ర భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కోరారు. బుధవారం మండల సీపీఐ నేతలతో కలిసి మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఇందుర్తి నుంచి ముదిమాణిక్యం, రామంచ, చిన్నముల్కనూర్, సీతారాంపూర్, పీచుపల్లి, రేకొండ, బొమ్మనపల్లి ద్వారా సైదాపూర్ మండలంలోని పలు గ్రామాల నుంచి భీమదేవరపల్లి మండలం వరకు కెనాల్ పనులు చేపట్టారన్నారు. గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఇంతవరకు మంజూరుకు నోచుకోలేదన్నారు. ఏటా భారీ వర్షాలకు కెనాల్‌కు గండ్లుపడుతుండగా రైతులు పంటలు నష్టపోతున్నారన్నారు. ఇందుకు మంత్రి ఉతమ్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల వెంకటస్వామి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్‌రెడ్డి, మండల సహాయకార్యదర్శి బూడిద సదాశివ తదితరులున్నారు.

మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి: మహిళల అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. రాష్ట్రంలో 200కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం పూర్తి చేసుకున్న సందర్భంగా చొప్పదండి మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను ఎమ్మెల్యే సన్మానించి, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, తహసీల్దార్ నవీన్ కుమార్, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, కాంగ్రెస్ నాయకులు, మహిళలు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న రాజ్‌కుమార్, శ్రీరామ్‌రెడ్డి, రేవంత్

హుజూరాబాద్: మల్కాజిగిరి ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్‌పై ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి చేసిన ఆరోపణలకు వెంటనే క్షమాపణ చెప్పాలని ఈటల జనసేన నాయకులు రాజ్‌కుమార్, శ్రీరాంరెడ్డి, రేవంత్‌లు అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 25 ఏళ్లుగా హుజూరాబాద్ నియోజకవర్గంలో ఎదురులేని నాయకుడిగా ఎదిగిన ఈటల రాజేందర్ ప్రజల అభిమానంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఇటీవల హుజూరాబాద్ నియోజకవర్గం నుంచి సుమారు 500 మంది కార్యకర్తలు స్వచ్ఛందంగా ఆయనను కలిసి మాట్లాడిన సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో హుజూరాబాద్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తామని ప్రకటించారని అన్నారు. ఇది జీర్ణించుకోని కౌశిక్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించి ఈటల రాజేందర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని తెలిపారు.ఈ సమావేశంలో ఈటల జనసేన నాయకులు తిరుపతి, రమేశ్, కుమార్, శివకుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి వ్యాఖ్యలతో ఆ పార్టీ నైజం బయటపడింది



మాట్లాడుతున్న గీకురు రవీందర్

చిగురుమామిడి: బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు అసాధ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు వ్యాఖ్యలు బీసీల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ నాయకుడు గీకురు రవీందర్ అన్నారు. చిగురుమామిడిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీలో బీసీ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు ఆ పార్టీ ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారని, తీరా పార్లమెంటులో బిల్లు ఆమోదింపజేసేందుకు ప్రయత్నించకుండా ఇలా మాట్లాడటంతో వారి నైజం బయటపడిందన్నారు. బీసీ సంఘం మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్, నాయకులు పెసరి శ్రీనివాస్, గుజ్జుల రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకుడు విష్ణు



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యాసంస్థల బంద్ ప్రశాంతం



హుజూరాబాద్‌లో ప్రభుత్వ పాఠశాలను బంద్ చేయిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలంటూ వామపక్ష విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ ఇచ్చిన బంద్‌పిలుపు మేరకు బుధవారం విద్యాసంస్థలు బంద్‌పాటించాయి. హుజూరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి కేశబోయిన రాము యాదవ్, మండల కార్యదర్శి రాంపెల్లి రోహిత్, నాయకులు రాహుల్, గణేశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. జమ్మికుంటలో జరిగిన నిరసనలో జిల్లా కోశాధికారి లద్దునూరి విష్ణు నాయకులు ఎండీ అజీం, అవినాశ్, శశి, గణేశ్, వికాస్, చొప్పదండిలో జరిగిన నిరసనలో నాయకులు మణికంఠ, శివ నిఖిల్, శ్రీకాంత్, సిద్ధార్థ, సాయి చరణ్, అశ్విన్ కుమార్, జాన్సన్, ఓంకార్, అభిరామ్, గణేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

– హుజూరాబాద్/చొప్పదండి/జమ్మికుంట

ఎంఈవోకు సన్మానం



ఎంఈవోను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

గంగాధర: విద్యార్థులకు పుస్తకాల భారం తగ్గించేందుకు వినూత్న ప్రయత్నంతో సత్ఫలితాలు సాధించిన మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకరావును బుధవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సన్మానించారు. విద్యార్థులకు బడి సంచి భారం కాకుండా పాత (గతేడాది వినియోగించిన) పుస్తకాలను విద్యార్థుల నుంచి సేకరించి వాటితో పాటు కొత్త పుస్తకాలు (రెండు జతలు) విద్యార్థులకు అందించారు. ఒక సెట్ ఇంటి వద్ద, మరో సెట్ పాఠశాలలో ఉంచి విద్యార్థులకు బ్యాగు బరువును తగ్గించారు. దీనిపై బుధవారం సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గట్టుభూత్కూర్ పాఠశాలను సందర్శించారు. వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన మండల విద్యాధికారిని సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణదారులకు నోటీసులు



మొలంగూర్‌లో విచారణ చేస్తున్న డీఎల్‌పీవో శ్రీనివాస్

శంకరపట్నం: అక్రమ నిర్మాణాలు చేసిన వారికి నోటీసులు జారీ చేస్తామని హుజూరాబాద్ డీఎల్‌పీవో శ్రీనివాస్ అన్నారు. శంకరపట్నం మండలం మొలంగూర్‌లో సర్వే నం.703 ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని రేకుల షెడ్డు, గోదాం నిర్మించారని ప్రజావాణిలో ఫిర్యాదు మేరకు బుధవారం విచారణ చేపట్టారు. అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎంపీవో ప్రభాకర్. ఫిర్యాదు దారు మోరె గణేశ్ ఉన్నారు.

డెంగీ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోండి



రికార్డులు పరిశీలిస్తున్న మలేరియా అధికారి రాజగోపాల్

శంకరపట్నం: ప్రజలు డెంగీ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి రాజగోపాల్ సూచించారు. కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. గతంలో కరీంపేట, తాడికల్‌లో ఎక్కువ మంది డెంగీ బారిన పడ్డారని, ముందు జాగ్రత్తగా గ్రామాల్లో వర్షం నీరు నిల్వ చేయకుండా, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి శ్రావణ్‌కుమార్‌ను ఆదేశించారు.

సమస్య పరిష్కరించకుంటే ఆమరణ దీక్షకు సిద్ధం



దీక్ష చేస్తున్న గ్రామస్తులు

వీణవంక: ఇసక లారీల మీద తాటిపత్రి కప్పే ఉపాధి కల్పించకుంటే ఆమరణ దీక్ష చేస్తామని హిమ్మత్‌నగర్ గ్రామస్తులు తెలిపారు. మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో గ్రామస్తులు చేస్తున్న నిరసన దీక్ష 14వ రోజుకు చేరింది. అధికారులు, కాంట్రాక్టర్ కుమ్మక్కై పొట్ట గొడుతున్నారని, ఆమరణదీక్ష చేయడానికి సిద్ధమవుతున్నామని అన్నారు. కార్యక్రమంలో గెల్లు మల్లయ్య,. తిరుపతిరెడ్డి, లకోట రాజన్న, భాస్కర్‌రెడ్డి, గెల్లు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



ఇల్లందకుంట: మండలకేంద్రంలో కుక్కల బెడద రోజురోజుకూ పెరిగిపోతోంది. గుంపులు గుంపులుగా తిరుగుతూ ఒంటరిగా వెళ్లే వారిపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. మండలవ్యాప్తంగా నెలకు సుమారు 30 మందిని కాటు వేశాయని పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, సెల్ నం.98496 60330

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి 19వ వార్డులో రరూ.5లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు కాంగ్రెస్ నాయకులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇల్లందకుంట దేవస్థాన మాజీ చైర్మన్ దేశినికోటి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేశ్ మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్‌చైర్మన్ ఎర్రం సతీశ్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఎదులపురం శ్రీహరి, పిట్టల రమేశ్, ఉడత వెంకటేశ్, సంకిస సురేశ్, రాజ్‌కుమార్, రామచంద్రం, శ్రీను, అడెపు రాయనర్సు, ఎండీ ఖాద్, ఎండీ రహీం, రాజకొంరయ్య, ఇస్మాయిల్, జావిద్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జమ్మికుంట: పట్టణంలో ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై తహసీల్దార్ వెంకట్‌రెడ్డికి బుధవారం ఉపాధ్యాయుల సంఘాల జేసీపీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అవాల నరహరి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, ఉద్యోగ, సమస్యలపై ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఆగస్టు 1న జిల్లా కేంద్రాల్లో ధర్నా, ఆగస్టు 23న రాష్ట్రస్థాయిలో మహాధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి అవినాశ్, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు వేణుమాధవ్, జనరల్ సెక్రెటరీ రాజేందర్, టీపీటీఎఫ్ జనరల్ సెక్రెటరీ కుమారస్వామి, నాయకులు పోతుల రాజయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానం

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్‌లో అతిథి అధ్యాపక పోస్టుకై అర్హులు దరఖాస్తు చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఇందిరాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్‌లో ఒక పోస్టు ఖాళీగా ఉందని, ఆసక్తి కలిగి, పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55శాతం మార్కులు, నెట్, సెట్, పీహెచ్‌డీ వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. బోధనలో అనుభవం ఉన్నవారికి వెయిటేజీ ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు 25 సాయంత్రం 4 గంటలలోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 26 ఉదయం 10గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

మడేలేశ్వరస్వామి బోనాలు



బోనాలతో మహిళలు

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామంలో బుధవారం రజక సంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వర స్వామి బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామ వీధుల గుండా డప్పుచప్పులతో మడేలేశ్వరస్వామి ఆలయానికి వెళ్లి బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు, రజక సంఘం అధ్యక్షుడు అనిల్, నాయకులు సమ్మయ్య, బాలలింగయ్య, హరీశ్, అంజి, రాకేశ్, మధు, అరుణ్, అరవింద్, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ ఆపరేటర్లు

శంకరపట్నం: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ–పంచాయతీ ఆపరేటర్‌లు బుధవారం ఎంపీడీవో కృష్ణప్రసాద్, ఎంపీవో ప్రభాకర్‌కు వినతిపత్రం అందించారు. నాలుగేళ్ల నుంచి నెలకు రూ.22,750 వేతనం ఇచ్చిన తమకు ప్రస్తుతం రూ.19,500 ఇస్తున్నారని వాపోయారు. సమస్యల పరిష్కారం కోసం కమిషనర్ కార్యాలయంలో చర్చించడానికి ఒక రోజు అనుమతి ఇవ్వాలని కోరారు. అనుదీప్, వెంకటేశ్, శ్రీనివాస్, స్రవంతి ఉన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

చొప్పదండి: ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి కోరారు. ఈమేరకు బుధవారం చొప్పదండి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీటీఎఫ్ స్టేట్ కౌన్సిలర్ సముద్రాల అంజయ్య, కానిగంటి రాజమౌళి, యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎల్లయ్య, డీటీఎఫ్ మండల అధ్యక్షులు గుర్రాల శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉత్కం వేణుగోపాల్, టిపిటిఎఫ్ మండల అధ్యక్షులు యామ తిరుపతి, జిల్లా కార్యదర్శి రామస్వామి, సంగనభట్ల సురేందర్, ఎండి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.